సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 5 । ఆగస్టు । 2025



విన్నపాలు వినవలె

పీజీఆర్ఎస్‌కు 140 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ అర్జీలు స్వీకరించారు.

- 8లో



అనుమానాస్పదంగా..

నరసన్నపేటలో ఓ మహిళ మృతి చెందారు. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- 8లో

అదనపు లోడు క్రమబద్ధీకరణకు డిసెంబర్ 31 వరకు గడువు

అరసవల్లి: జిల్లాలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు డిసెంబర్ 31 వరకు గడువు పెంచినట్లుగా విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. ఈ మేరకు ఆయన శని వారం మాట్లాడుతూ వినియోగదారులు తమ వినియోగానికి చెందిన అదనపు లోడు అవసరాన్ని గుర్తించి స్వచ్ఛందంగా క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశముందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

950 కిలోల రేషన్ బియ్యం సీజ్



పలాసపురంలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామంలో విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామంలోని గార అప్పన్న ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న 950 కిలోల రేషన్ బియ్యం సీజ్ చేశారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తప్ప వన్నారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు, ఆర్ఐ కిరణ్, గ్రామ రెవెన్యూ అధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఆర్థిక సాయం లాంటి ఎన్నో ప్రోత్సాహకాలు లభిస్తాయని డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, వరల్డ్ బ్యాంక్ సహకారంతో జిల్లా మహిళా సమాఖ్యలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమం ద్వారా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఇంకా చేయని చిన్నతరహా యూనిట్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత అందించడమే లక్ష్యమని తెలిపారు. రిజిస్ట్రేషన్ ద్వారా లభించే ప్రయోజనాలు, సబ్సిడీలు, రుణ సదుపాయాలు వంటి అంశాలను సమగ్రమైనవిగా వివరించారు. అర్హత ప్రమాణాలైన పెట్టుబడి పరిమితులు, టర్నోవర్ వివరాలపై ఈ సదస్సులో అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, పరిశ్రమల శాఖ ఐపీఓ కిరణ్, డీపీఎంలు, తదితర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'డిపోను విడదీయవద్దు'



ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలుపుతున్న ఐఎంఎల్ యూనిట్ కార్మికులు

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీయవద్దని, విభజనకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఐఎంఎల్ డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీలు ఒంటి కాలిపై నించుని ధర్నా నిర్వహించారు. అవసరం లేకున్నా డిపోను విడదీసి పేదల పొట్టలు కొట్టవద్దని కోరారు. కార్యక్రమంలో హమాలీల యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎం.సురేష్, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, రాజు, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని హుండీ కానుకల ఆదాయం రూ.70.66 లక్షలు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ ప్రసాద్, గురునాథరావు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.70,66,265 ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ ప్రకటించారు. సోమవారం స్థానిక అనివెట్టి మండపంలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియలో నగదు రూపంలో రూ. 66,94,348, చిల్లర రూపంలో రూ.3,71,917 వరకు ఆదాయం లభించింది. కాగా మొత్తం 69 రోజులకు గాను ఇంతటి రికార్డు స్థాయి ఆదాయం లభించగా.. సగటున రోజుకు రూ.1,02,409 చొప్పున ఆలయానికి ఆదాయం వచ్చినట్లుగా అధికారులు అంచనా కట్టారు. ఇక ఈ లెక్కింపులో 23 గ్రాముల బంగారం, 2 కేజీల 380 గ్రాముల వెండి వస్తువులు మొక్కుల క్రింద హుండీలో లభించాయని ఆయన తెలియజేశారు. అలాగే యూఎస్ డాలర్లు 135, సింగపూర్ 10 డాలర్లు, యూఏఈ కరెన్సీ 10 దిరమ్స్‌తో పాటు ఇతర విదేశీ కరెన్సీ కూడా లభించినట్లుగా తెలియజేశారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఈఓలుగా గురునాథరావు, శ్యామలరావు, సుకన్య తదితరులున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఎర్రటి ఎండలో
నిలబెడుతున్నారు

- ఎరువుల పంపిణీలో అధికార పార్టీ నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారు
- ఎరువుల కొరత తీవ్రంగా ఉంది
- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ఈ ఏడాది ఖరీఫ్‌లో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్రంలో యూరియా ఇతర కాంప్లెక్స్ ఎరువుల కొరత ఎక్కువగా ఉందని, వచ్చిన కొద్దిపాటి ఎరువులు టీడీపీకి చెందిన వారు తీసుకొని, ఇతర రైతులకు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు అనేక హామీలు ఇచ్చిందని, కానీ రెండేళ్లకు రూ.40వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ఏడు లక్షల మందికి అన్నదాత సుఖీభవ పథకంలో కోత పెట్టారని పేర్కొన్నారు. ఉచిత పంటల బీమాను రద్దు చేశారని, గత ఏడాది బీమా చెల్లించకపోవడంతో రైతులకు బీమా డబ్బులు రాని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రైతులకు సున్నావడ్డీ పథకాన్ని కూడా ఎత్తివేశారన్నారు. రైతుకు విత్తనం నుంచి పంట అమ్మకం వరకూ అండగా ఉన్న ఆర్బీకేల వ్యవస్థను పూర్తిగా నీరుగార్చారని తెలిపారు.

రైతులకు ఎరువులు పంపిణీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ఎరువుల కోసం రైతులు మళ్లీ క్యూలో నిలుచోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. ఈ పరిస్థితులను ప్రైవేటు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. యూరియా కేటాయింపులకు, సరఫరాకు మధ్య చాలా వ్యత్యాసం ఉందని, పొటాష్ కలిసిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు అమాంతం పెరిగిపోయాయన్నారు.

యూరియా బస్తాపై వాస్తవ ధర కంటే బ్లాక్ మార్కెట్‌లో రూ.60 నుంచి రూ.100 వరకు అదనంగా డిమాండ్ చేస్తున్నారని, వ్యాపారుల చేతుల్లోకి ఎరువులు వెళ్లిపోయాయని తెలిపారు. ఎర్రటి ఎండలో ఎరువుల కోసం రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు అధికారులను బెదిరించి ఎరువులు తీసుకుపోతున్నారని, కక్ష సాధింపు రాజకీయాలు, డైవర్షన్ రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గ్రీవెన్స్ సెల్ అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ.. తాను ఉన్నంత కాలం రైతుకు భరోసా ఉండదని చంద్రబాబు నాయుడే చెప్పారని, రైతుల పట్ల ఆయన తీరుకు ఇదే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్ కుమార్, రెడ్డి శాంతి, పార్టీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి సత్యనారాయణ, నాయకులు గొండు రఘురాం, కరిమి రాజేశ్వరరావు, జి.పురుషోత్తం, రౌతు శంకరరావు తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు ధర్మాన కృష్ణదాస్, కుంభా రవిబాబు తదితరులు

డిమాండ్లు ఇవే..

- రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు వెంటనే ఎరువులను అందుబాటులో ఉంచాలి. యూరియా కొరతను వెంటనే నివారించాలి.
- అధికారులతో అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేసి, గ్రామస్థాయి వరకూ పంపిణీపై దృష్టిపెట్టాలి. ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని, కొరత ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల్లో నిల్వలు ఉంచాలి. అక్కడే రైతులందరికీ అందజేయాలి.
- ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలి. బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారి లైసెన్సులు రద్దు చేయాలి. వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి.
- ఎరువుల నిల్వలపై వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలి. ప్రత్యేక నిఘా ఉంచాలి.
- ఎరువుల నిల్వలను రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేక యాప్ లేదా, వెబ్‌సైట్‌లో ఉంచేలా చర్యలు తీసుకోవాలి.
- వీటితోపాటు ఉచిత పంటల బీమాను అమలు చేయాలి.
- గత ఏడాది రైతు భరోసా డబ్బుల బకాయిలను కూడా వెంటనే చెల్లించాలి.
- ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమే రూ.20వేలు సాయం అందించాలి.
- తొలగించిన రైతులకు కూడా పెట్టుబడి సాయం అందజేయాలి.

ఇసుకాసురులపై
గ్రీన్ గన్





నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దృష్టికి వెళ్లిన ఇసుక అక్రమాలు

- పాతూరు ఘటనపై సుమోటోగా విచారణ
- జిల్లా, రాష్ట్ర, కేంద్ర అధికారులకు నోటీసులు కూడా జారీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో జరుగుతున్న అక్రమ ఇసుక వ్యాపారంపై ఎట్టకేలకు విచారణ దిశగా ఓ అడుగు ముందుకు పడింది. ఆమదాలవలస మండలం పాతూరులో ఇటీవల జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలు, స్థానికుల అడ్డగింపు, అడ్డుకున్న వారిపై గ్రామంలో ఇంటింటికీ వెళ్లి దాడి చేయడాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సీరియస్‌గా తీసుకుంది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటాగా విచారణకు ఉపక్రమించింది. దీనికి సంబంధించి కలెక్టర్, కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లకు, భూగర్భ గనుల శాఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 24కి వాయిదా వేసింది..

ఉచితం ముసుగులో..

గత ప్రభుత్వంలో ఇసుక నిర్వహణకు సంబంధించి ఒక ఏజెన్సీకి అప్పగించడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చింది. ఇసుక పక్కదారి పట్టలేదు. కానీ ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వంలో ఇసుక అక్రమాలు జరిగిపోయాయని తమ చేతుల్లో ఉన్న అధికారుల చేత ఒక నివేదిక తయారు చేయించేసింది. దాన్ని తమ ప్రచారం కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం కళ్లముందే ఇసుక దోపిడీకి గురవుతోంది. నదీ తీర ప్రాంతాలను తమ పార్టీ నాయకులకు రాసిచ్చేసినట్టు ఎక్కడికక్కడ తవ్వకాలు చేపడుతున్నారు. ప్రభుత్వానికి చిల్లి గవ్వ ఆదాయం రావడం లేదు. ఉచితం ముసుగులో టీడీపీ నాయకుల జేబులను నింపుతోంది. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు పేర్లు చెప్పి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. తాజాగా ఆమదాలవలస మండలం పాతూరులో అదే జరిగింది. నదిలో అడ్డగోలుగా తవ్వకాలు జరపడమే కాకుండా అక్రమ రవాణా సాగిస్తున్నారు. స్థానికులు అడ్డుకుంటే వారిపై ఇళ్లకు వెళ్లి రౌడీల చేత దాడులు చేయించారు. పోలీసుల ముందే దాడులు జరిగాయి. కానీ, యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. వారిపై చర్యలు తీసుకోలేదు. ఇవన్నీ 'సాక్షి' పత్రికలో పతాక శీర్షికన కథనాల రూపంలో ప్రచురితమయ్యాయి. తాజాగా పత్రికా కథనాల ఆధారంగా సుమోటోగా విచారణకు తీసుకున్నట్టుగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఏకంగా పత్రికా ప్రకటన విడుదల చేయడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

అన్నిచోట్లా ఉల్లంఘనులే..

వాస్తవంగా పాతూరు తరహాలో జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పి పేరు చెప్పి దోపిడీ చేస్తున్నారు. అంతా కుమ్మక్కై కోట్లాది రూపాయల ప్రజా సొమ్మును జేబుల్లో నింపుకుంటున్నారు. డీసిల్టేషన్ పాయింట్ ముసుగులో వంశధార, నాగావళి, బాహుదా నదులను కబళించేస్తున్నారు. ఇవన్నీ సుప్రీంకోర్టు, ఎన్జీటీ నిబంధనలకు విరుద్ధంగానే జరుగుతున్నాయి. నదుల గర్భంలోనే యంత్రాలు పెట్టి తవ్వకాలు చేపడుతున్నారు. మంచినీటి బావులు, వంతెనలకు ముప్పు వాటిల్లేలా తవ్వకాలు చేస్తున్నారు. అక్రమార్కుల దెబ్బకు కొన్నిచోట్ల భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మరికొన్నిచోట్ల తవ్వకాలతో ఏర్పడిన గుంతల కారణంగా సముద్రం బ్యాక్ వాటర్ వచ్చేసి నదీ జలాలు ఉప్పునీటి మయమైపోయాయి. మరికొన్నిచోట్ల నదులను ఎక్కడికక్కడ తవ్వేసి, పెద్ద పెద్ద గోతులు చేయడంతో ప్రమాదాలకు తావిస్తున్నాయి. అక్రమ రవాణా సాగిస్తున్న లారీలతో రోడ్లు ఛిద్రమైపోతున్నాయి. నదిలోకి నీరొస్తే తవ్వకాలకు ఇబ్బందని, తవ్వకాలు జరిగే చోటుకి వరద నీరు రాకుండా ఉండటానికి నదీ ప్రవాహానికి మధ్యలో గట్టు నిర్మించారు. భారీ ట్రక్కుల ద్వారా ఇసుక రవాణా చేసేందుకు ఇబ్బంది రాకుండా ఉండేలా నదిలోనే పైపులతో గట్లు నిర్మించారు. వాస్తవంగా నదిలో యంత్రాల ద్వారా ఎలాంటి పనులు చేపట్టకూడదు. పర్యావరణానికి హాని కలిగించే ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని సుప్రీంకోర్టు కూడా స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చింది. కానీ అవేవీ పట్టించుకోవడం లేదు. ఇసుక మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు.



జిల్లా అంతటా అక్రమ తవ్వకాలే

జిల్లాలో అక్కడా ఇక్కడా అని కాకుండా వంశధార, నాగావళి, బాహుద నదుల తీరప్రాంతాల పొడవునా ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పటికే రూ. వేల కోట్ల ఇసుకను దోచేశారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని పాతూరు, దిబ్బలపేట, ముద్దాడ పేట, కాఖండ్యాం, నారాయణపురం, పురుషోత్తపురం, చినంకలాం, నిమ్మ తొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, బెలమం, లొద్దలపేట, కొత్తవలస, సింగూరు, నైరా, అంబళ్లవలస,శ్రీకాకుళం నియోజకవర్గంలోని బైరి, కరజాడ, బూరవల్లి, కళ్లేపల్లి, కిల్లిపాలెం, పొన్నాం, బట్టేరు, గార, నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం, పర్లాం, రామకృష్ణాపురం, శ్రీముఖలింగం, దొంపాక, లుకలాం, బుజ్జిపేట, చేనువలవలస, చెవ్వాకులపేట, గోపాలపెంట, ఉర్లాం, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బిర్లంగి, బొడ్డవడ, ఈదుపురం, కేసుపురం, కొళిగాం, ఇచ్ఛాపురం టౌన్ పరిధిలో బాహుదా నది కొత్త, పాత బ్రిడ్జిల దగ్గర, పాతపట్నం నియోజకవర్గంలోని గులుమూరు, ఆకులతంపర, పాత పొనుటూరు, హిరమండలం మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిపి భారీ ఎత్తున దోపిడీ చేశారు. నదుల్లోకి వరద నీరు వచ్చేస్తే తమ ఇసుక వ్యాపారం పోతుందని తవ్విన ఇసుకను నదీ తీరగ్రామాల్లోని తోటల్లో డంప్ చేస్తున్నారు. అక్రమ ఇసుకను తరలించేందుకు నకిలీ బిల్లులు సృష్టించారు. జిల్లాలో ఇసుక ద్వారా రోజుకి రూ.50లక్షల వరకు అక్రమంగా ఆర్జిస్తున్నారు. ప్రతీ రోజూ 500లారీల వరకు అక్రమంగా ఇసుక తరలిపోతోంది.

అక్రమ తవ్వకాలు అడ్డుకుంటే దాడులు



తమ తవ్వకాలకు అడ్డొస్తే ఇసుక మాఫియా దాడులకు తెగబడుతోంది. నారాయణపురం వద్ద, దూసి వద్ద, పాతూరు వద్ద, గోపాలపెంట వద్ద ఇలా అనేక ప్రాంతాల్లో అడ్డుకునేందుకు ప్రయత్నించే వారిపై దాడులు చేశారు. చంపడానికి కూడా ప్రయత్నించారు. తమ అక్రమాలకు అడ్డొస్తే వదలబోమని బహిరంగంగానే వార్నింగ్‌లు ఇస్తున్నారు. అటు రెవెన్యూ, ఇటు మైనింగ్, పోలీసు అధికారులు సైతం చోద్యం చూస్తున్నారు. విచిత్రమేమిటంటే వారి కళ్లముందే ఇసుక అక్రమార్కులు దాడులకు దిగడం విశేషం. ఆ మధ్య ఏకంగా శ్రీకాకుళం నగరం నడిబొడ్డునే ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నారని ఏకంగా ఒక వ్యక్తిని చితకబాదారు. ఇసుక అక్రమ ర్యాంపులు నడుపుతున్న వారంతా కిరాయి గూండాలను చేతిలో ఉంచుకున్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల్లో ఇలాంటి కిరాయి మూకలు చాలానే ఉన్నాయి. వీరితో జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

దిగజారి మాట్లాడవద్దు

- ఎమ్మెల్యే శిరీషపై మండిపడిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

పలాస: గత కొద్ది రోజులుగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఎమ్మెల్యే స్థాయిని మరిచి దిగజారి మాట్లాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశీబుగ్గలోని పార్టీ కార్యాలయం ప్రగతిభవన్‌లో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీచ రాజకీయాలు చేస్తూ నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. తనను ఉద్దేశించి మాటిమాటికీ మాజీ పశువని, భాషా సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని, కానీ తాను ఆ స్థాయికి దిగజారి మాట్లాడలేనని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవస్థలన్నీ పాడైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలాస నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతోందని అన్నారు. లిక్కరు బాటిల్ మీద రూ.10లు అదనంగా వసూలు చేస్తున్నారని, ఈ సొమ్మంతా ఎవరి జేబులోకి వెళ్తుందని ప్రశ్నించారు. పలాసలోని సూదికొండ అక్రమ కంకర తవ్వకాల సంగతేంటన్నారు. వాటిని పరిశీలించడానికి ఎమ్మెల్యేను పిలుస్తున్నామని, సూదికొండ వద్దకు వస్తారా, ఉజ్జుడు మెట్ట వద్దకు వస్తారా మీ అధికారులను, పోలీసులను తీసుకొని వస్తారా అని ప్రశ్నించారు. ఇసుక లారీ స్టిక్కర్ల సంగతేంటన్నారు. ఒక లారీ నుంచి రూ.3వేల నుంచి రూ.5వేలు వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

వీటన్నింటిపై ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంశధార నీరు శివారు వరకు ఇవ్వాలన్నారు. అభివృద్ధి గురించి శిరీష మాట్లాడటం, తాత తండ్రుల గురించి గొప్పలు చెప్పుకోవడం కాదని, గతంలో మంత్రిగా తాను చేసిన అభివృద్ధి ఏంటో గత 60 ఏళ్లలో గౌతు కుటుంబం చేసిన అభివృద్ధి ఏమిటో ఈ నియోజకవర్గం ప్రజలకు తెలుసని అన్నారు.

ఎండ.. గొడుగులే అండ



సోమవారం సూరీడు విజృంభించాడు. జిల్లావ్యాప్తంగా తీక్షణమైన కిరణాలతో దాడి చేశాడు. ఈ వేడి దాడి నుంచి తప్పించుకోవడానికి ఇలా గొడుగులను ఆశ్రయించారు. టెక్కలి కాలేజీ విద్యార్థినులు ఇలా గొడుగులు వేసుకుని కాలేజీకి వచ్చారు.

– టెక్కలి రూరల్

జిల్లాపై వీడియో పోటీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయినందున వీడియోల తయారీకి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రత్యేక పోటీ నిర్వహించనున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఫ్లుయెన్సర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ప్రాశస్త్యాన్ని హైలైట్ చేసేలా లాండ్‌స్కాప్ ఫార్మాట్‌లో మూడు నిమిషాల నిడివి కలిగిన వీడియోను రూపొందించాలని సూచించారు. వీడియోలను ఆగస్టు 9వ తేదీ ఉదయం 11 గంటల లోపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ మెయిల్ ఐడికి (డీఎస్‌డీఓ.శ్రీకాకుళం@ ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్) పంపాలని కోరారు. బహుమతులు అందజేస్తామని ప్రకటించారు.

ఆ సెల్‌ఫోన్లు వద్దు బాబోయ్



వివిధ రకాల యాప్‌లతో ప్రభుత్వం అంగన్‌వాడీలను వేధిస్తోందని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు ధ్వజమెత్తారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన సెల్‌ఫోన్‌లు సక్రమంగా పనిచేయడం లేదని, దీని వల్ల తమకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, అందువలన వీటిని ఐసీడీఎస్ అధికారులకే అప్పగిస్తున్నామని తెలియజేస్తూ శ్రీకాకుళంలోని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నగరంలోని అంగన్‌వాడీలు సోమవారం నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. లబ్ధిదారుల ఫొటోలు తీస్తుంటే సర్వర్లు పనిచేయడం లేదని, గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలు సెల్‌ఫోన్‌లను సీడీపీఓ నాగరాణికి అందజేయగా వాటిని ఆమె తీసుకోలేదు. ప్రభుత్వం కొత్తవి ఇస్తుందని చెప్పగా.. అంగన్‌వాడీలు ససేమిరా అంటూ సెల్‌ఫోన్‌లు పట్టుకువెళ్లేందుకు నిరాకరించారు.

–శ్రీకాకుళం అర్బన్

క్లుప్తంగా

రూ.1.66 లక్షల ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సీహెచ్ రంజిత్ కొద్ది నెలలుగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. వారి కుటుంబం ఆర్థికంగా వెనుకబడడంతో సరైన వైద్యం అందించలేని పరిస్థితి ఉంది. ఈ విషయాన్ని గమనించిన కళాశాల అధ్యాపకులు విద్యార్థి పరిస్థితిపై చలించిపోయారు. ఈ మేరకు ఉదార హృదయంతో వారంతా కలిసి రూ.1.66 లక్షలు సేకరించి కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్ చేతులమీదుగా సోమవారం రంజిత్ కుటుంబానికి అందజేశారు. దీంతో వీరిని స్థానికులు అభినందించారు.

గంజాయితో ఆరుగురు అరెస్టు

ఆమదాలవలస: పట్టణంలోని వన్ వే ట్రాఫిక్ రోడ్ జంక్షన్ కంద్రపేట సమీపంలో గంజాయి తరలిస్తుండగా ఆరుగురు వ్యక్తులను ఆమదాలవలస పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఆమదాలవలస పోలీసులు దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి బయటకు వస్తున్న వ్యక్తులను పట్టుకొని ఆరా తీశారు. వారి వద్ద 15 గంజాయి చాక్లెట్లను గుర్తించినట్లు తెలిపారు. ఈ చాక్లెట్లు సుమారు 90 గ్రాముల బరువు ఉంటాయని పేర్కొన్నారు. దీంతో శ్రీకాకుళం సెవెన్ రోడ్డు జంక్షన్ సమీపంలోని సారంగజోల వీధికి చెందిన సిరిగిడి శ్రీనివాసరావు, కటుమల తరుణ్ కుమార్, బొబ్బోడి మణికృష్ణ, వంజరపు భార్గవ్, శ్రీకాకుళం దమ్మలవీధికి చెందిన ఫరీద్ ఖాన్, శ్రీకాకుళం రెల్లివీధికి చెందిన జలగడుగుల ప్రసాద్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

విన్నపాలు వినవలె..!



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- మీకోసంకు భారీగా వినతులు
- 140 ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీదారుల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా విద్యా శాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, డ్వామా, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖల సమస్యలపై 140 అర్జీలు స్వీకరించారు. అర్జీల స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వజ్రోత్సవాలు

శ్రీకాకుళం జిల్లా ఏర్పాటై ఆగస్టు 15వ తేదీ నాటికి 75 ఏళ్లు పూర్తవ్వనున్న నేపథ్యంలో ఘనంగా వజ్రోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలియజేశారు. శ్రీకాకుళం ఔన్నత్యాన్ని చాటి చెప్పేవిధంగా వేడుకలు నిర్వహించాలన్నారు. గొట్టా బ్యారేజీ నిర్మాణం, పొందూరు ఖాదీ, పలాస జీడిపప్పు ఫ్యాక్టరీ ఏర్పాటు, చరిత్ర కలిగిన దేవాలయాలు, జిల్లాలో ఉన్న ప్రాంతాల ప్రాచుర్యం, జిల్లాలోని ప్రముఖుల గురించి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వచ్చే వివిధ రకాల దరఖాస్తులను పరిశీలించి ప్రజలకు సేవలందించాలని అధికారులను ఆదేశించారు.

కిడ్నీ రోగులను ఆదుకోవాలి

పొందూరు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ రోగుల సంఖ్య పెరిగిందని, ఇటీవల కాలంలో సుమారు 19 మంది ఈ వ్యాధితో మృత్యువాత పడ్డారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఈ మేరకు కృష్ణాపురం మరో ఉద్దానంగా మారకముందే అక్కడ వ్యాధికి గల కారణాలను అన్వేషించాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం గ్రామంలో మరో 22 మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య శిబిరాలు నిర్వహించి, కావాల్సిన మందులు, ఇతర సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. అలాగే ఆమదాలవలస నియోజకవర్గంలో ఇటీవల మంజూరైన నూతన పింఛన్లకు సంబంధించి లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకొని డబ్బులు ఇవ్వలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎస్.చంద్రమౌళి, గోవిందరావు తదితరులు ఉన్నారు.

వంటశాల నిర్మాణానికి అడ్డుపడుతున్నారు



ఫిర్యాదు చేస్తున్న గీతా ప్రచారక సమాజం ప్రతినిధులు

శ్రీకాకుళం నగరంలో బొంతావారి వీధిలోని గీతా ప్రచారక వారి సమాజం వంటశాల నిర్మాణానికి తూర్పు పక్కనున్న ఇంటి యజమాని అడ్డుపడుతున్నారని, నిర్మాణం చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గీతా ప్రచారక సమాజం ప్రతినిధులు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంస్థ భక్తుల ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు, అన్నదానం, ధార్మిక ఉపన్యాసాలు, సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. వంటశాల నిర్మాణం చేస్తుంటే తూర్పు పక్క ఉన్న ఇంటివారు చెత్తచెదారాలు ఆ స్థలంలో వేసి అడ్డుపడుతున్నారన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో జి.గోపాలకృష్ణ, రామారావు, మురకయ్య తదితరులు ఉన్నారు.

అడంగల్ ఇప్పించండి

కొత్తూరుకు చెందిన పాగిలి అన్నపూర్ణ తనకు తల్లిదండ్రులు కడగల సుందరరావు, కాంతమ్మల నుంచి వారసత్వంగా వచ్చిన భూమికి సంబంధించిన అడంగల్, 1-బీలు ఇప్పించాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో సోమవారం వినతిపత్రం అందజేసింది. తన తండ్రికి నాలుగు ఎకరాల పైన భూమి ఉండేదని, తాము ముగ్గురు అక్కచెల్లెళ్లమని ఫిర్యాదులో పేర్కొంది. తాను కుటుంబంలో పెద్ద అయినందున 1.90 సెంట్ల భూమి వాటా వచ్చిందని, అయితే ఆ భూమికి తహసీల్దారు అడంగల్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన భూమిని తహసీల్దారు వేరేవారి పేరిట మార్చారని వాపోయింది. తనకు న్యాయం చేయాలని కోరింది. లేకపోతే ఆత్మహత్యే శరణ్యమని పేర్కొంది. అయితే అంతకుముందు అన్నపూర్ణ పురుగుల మందు డబ్బాను తనతో పాటు తీసుకు రావడం కలకలం సృష్టించింది. ఆమె బ్యాగును తనిఖీ చేసిన పోలీసులు పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకున్నారు.



అన్నపూర్ణ వద్ద నుంచి పురుగుల మందు స్వాధీనం చేసుకుంటున్న మహిళా కానిస్టేబుల్

ఎస్పీ గ్రీవెన్స్‌కు 48 వినతులు



బాధితుల గోడు వింటున్న అదనపు ఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్)కు బాధితుల నుంచి 48 వినతులు అందాయి. అదనపు ఎస్పీ కేవీ రమణ వినతులు స్వీకరించి సకాలంలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

రమ్మీ చేసిన చేటు

ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఇద్దరి మధ్య వివాదానికి తెరలేపింది. ఐదురోజుల క్రితం ఒకరు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా, మరొకరు ఎస్పీ గ్రీవెన్సులో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్పీ గ్రీవెన్స్‌లో బాధితుడు రబీంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కాశీబుగ్గ సమీపంలోని రాజగోపాలపురం గ్రామంలో పంచముఖి గ్రానైట్ ఎగ్జిమ్ కంపెనీలో విజయనగరం జిల్లా తర్లాం మండలం కుసుమూరుకు చెందిన బీడిక రబీంద్ర సంవత్సరకాలంగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. పలాసలోనే భార్య, పిల్లలతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. అదే కంపెనీలో ఒడిశాకు చెందిన చంద్రమణి అడ్డువాడ్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి నాలుగైదు నెలలుగా ఆన్‌లైన్‌లో రమ్మీ గేమ్ ఆడుతున్నారు. మొదట్లో రమ్మీలో డబ్బులు ఎక్కువగా గెలవడంతో చంద్రమణికి దాదాపు రూ.1 లక్ష వరకు తాను ఇచ్చానని ఫిర్యాదులో రబీంద్ర పేర్కొన్నాడు. అనంతరం చంద్రమణి తన ఫోన్‌కు వేర్వేరు సందర్భాల్లో డబ్బులు పంపి అతనే రమ్మీ ఆడేవాడని, ఈక్రమంలో అధికంగా డబ్బులు పోగొట్టుకున్నాడని తెలిపారు. ఈవిధంగా దాదాపు తనకు రూ.1.67 లక్షలు ఫోన్‌పే ద్వారా పంపించాడని, అవన్నీ అతడే రమ్మీ ఆడి పోగొట్టుకున్నాడని పేర్కొన్నారు. కానీ తానే ఆన్‌లైన్ నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.1,73,500లు అతడి నుంచి కాజేసినట్లు కాశీబుగ్గ పోలీసులకు చంద్రమణి ఫిర్యాదు చేశాడని వాపోయాడు.

మొబైల్‌ను దాచేసి.. క్వారీలో దాడి చేసి

కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసిన చంద్రమణి, అతడి మద్దతుదారులు సెల్వరాజ్, మరో వ్యక్తి తనపై దాడికి పాల్పడ్డారని రబీంద్ర ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన సెల్‌ఫోన్ లాగేసుకుని అందులో ఆధారాలన్నీ డిలీట్ చేసి పోలీసులకు అప్పజెప్పారన్నారు. స్టేషన్‌లో తనను మూడురోజులుంచారని, అనంతరం ఈనెల 3వ తేదీ రాత్రి పోలీసులు వదిలేయడంతో ఇంటికి వెళ్తుండగా బొలేరో వాహనంలో చంద్రమణి మద్దతుదారులొచ్చి బలవంతంగా ఎక్కించేందుకు ప్రయత్నించగా తప్పించుకు పారిపోయానని పేర్కొన్నాడు. సోమవారం సైతం ఇదే విషయంపై కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వస్తుండగా, పలాస ఆర్టీసీ కాంప్లెక్సు సమీప ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద చంద్రమణి, మరో ఇద్దరు కాపుకాశారన్నారు. దీంతో తనపై దాడి చేసి చంపేస్తారేమోనన్న భయంతో నేరుగా జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

శ్రీముఖలింగంలో శివ స్వాముల సందడి



ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న శివస్వాములు

జలుమూరు: శ్రావణ మాసం సోమవారం ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శివస్వాములు మధుకేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వారు తెచ్చిన తేనె, పానకాలు, ఇరుముడులు స్వామికి సమర్పించి గోలెం మొక్కులు తీర్చారు. ప్రతి ఏడాది స్వామివారికి దీక్షతో మొక్కులు తీర్చి ఇరుముడి సమర్పించడం శివ భక్తులు ఆచారం అని భక్తులు తెలిపారు.

అలాగే పర్లాఖిముండి, కాత్రగడ నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రీసర్వే పనులను వేగవంతం చేయాలని, ప్రత్యేకంగా జాయింట్ ఎల్పీఎం (జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్) పూర్తి చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీసర్వే రెండో విడతకు ఎంపికైన 49 గ్రామాల్లో నిర్దిష్ట గడువులోగా సర్వే పూర్తి చేయాలని, ఇప్పటికే పూర్తయిన గ్రామాల్లో తలెత్తిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. రీసర్వేలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, పీజీఆర్ఎస్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

మూడో దశలో మిగిలిన గ్రామాల్లో గ్రామ, ప్రభుత్వ భూములకు సరిహద్దులు సెప్టెంబర్ 30లోగా నిర్ణయించాలని స్పష్టం చేశారు. జాయింట్ ఎల్పీఎంల సమస్యను అత్యల్ప రుసుము రూ.50తో పరిష్కరించే అవకాశం కల్పించిందని, ఈ విషయమై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఈ-డివిజినల్ మేనేజర్ పోస్టుల అర్హుల జాబితా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఈ-డివిజినల్ మేనేజర్ పోస్టు భర్తీకి సంబంధించి జిల్లా సెలెక్షన్ కమిటీ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, జూలై 16 నుంచి 29 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులు, అనర్హుల జాబితాలు సిద్ధం చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్హతల ఆధారంగా రాత పరీక్షకు అర్హత పొందిన అభ్యర్థుల జాబితా, పరీక్షా తేదీ,కేంద్రాల వివరాలు జిల్లా అధికారిక వెబ్‌సైట్ srikakulam.ap.gov.inలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అర్హత పొందిన అభ్యర్థులకు ఆగస్టు 5న హాల్ టికెట్లు, వారి దరఖాస్తులో పేర్కొన్న మొబైల్ నంబర్లకు వాట్సాప్ ద్వారా, అలాగే ఇమెయిల్ ద్వారా పంపించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు తమ పేరు, హాల్ టికెట్, పరీక్ష కేంద్రం వివరాల కోసం జిల్లా వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కోర్టుల్లో ఏళ్లకు ఏళ్లు న్యాయ వివాదాలు నడుస్తున్నాయని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు మధ్యవర్తిత్వం ఉత్తమ మార్గమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పేర్కొన్నారు. 90 రోజుల మీడియేషన్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన న్యాయవాదులు కక్షిదారులకు అనుకూలంగా వ్యవహరించాలని, కోర్టు వెలుపలే పరస్పర రాజీలకు ప్రయత్నించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజలు చట్ట సహాయాన్ని పొందేందుకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు నెలలో చేపట్టిన కార్యకలాపాలపై సమీక్ష జరిపారు. సమావేశంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, పలువురు న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆలయంలో నియామకాలు



అరసవల్లి ఆదిత్యాలయం

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో సిబ్బంది కొరతకు చెక్ పడనుంది. ఇంతవరకు దినసరి వేతనదారుల రూపంలో పనిచేస్తున్న సిబ్బంది స్థానంలో కొత్తగా అవుట్ సోర్సింగ్ విధానంలో నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు ఈనెల 18న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కోసం టెండర్ ప్రక్రియను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ ప్రకటించారు. ఆలయ పరిసరాల్లో గోశాల సిబ్బంది - 2, గార్డెన్, ఇంద్ర పుష్కరిణి నిర్వహణకు - 2, అన్నప్రసాద వితరణ సిబ్బంది - 13, లడ్డూ, పులిహోర ఇతర ప్రసాదాల తయారీ, ఉచిత ప్రసాద వితరణ సిబ్బంది - 12, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది - 7, మతపరమైన సిబ్బంది - 7, టెక్నికల్ సిబ్బంది - 3 తదితర 46 పోస్టులు కొత్తగా భర్తీ కానున్నాయి. ఈ మేరకు ఒక ఏడాదికి ఏజెన్సీ గుర్తింపునకు ఈనెల 18న సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో టెండర్ ప్రక్రియను నిర్వహించనున్నారు. దీంతో దినసరి వేతనదారులకు బదులు తొలిసారిగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆలయ సేవలో ఉండనున్నట్లు పేర్కొన్నారు.

16 నెలలుగా సీఆర్పీ గైర్హాజరు

- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

పొందూరు: ఉద్యోగులు చెప్పాపెట్టకుండా ఒక్కరోజు సెలవు పెడితేనే అధికారులు సంజాయిషీ తీసుకుంటారు. అటువంటిది ఎటువంటి సెలవు దరఖాస్తు లేకుండా సుమారు 16 నెలలుగా సీఆర్పీ(సీఆర్ఎంటీ) విధులకు గైర్హాజరవుతుంటే కనీసం మండల విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని లోలుగు క్లస్టర్ పరిధిలో సీఆర్పీ(సీఆర్ఎంటీ)గా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉషాబాల విధులు నిర్వహించేవారు. 2024 ఏప్రిల్ నుంచి కొన్ని రోజులు మెడికల్ లీవ్ పెట్టిన ఆమె ఇప్పటికీ విధులకు గైర్హాజరవుతోంది. సుమారు 16 నెలల నుంచి కనీసం అధికారులకు సమాచారం లేకుండా, సెలవు దరఖాస్తు పెట్టకుండా ఉన్నారు. ఇలా ఉంటే అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత క్లస్టర్ పరిధిలోని పాఠశాలల పనినంతా వేరే క్లస్టర్ సీఆర్పీకి మండల విద్యాశాఖాధికారులు అప్పగించారు. దీంతో రెండు క్లస్టర్ల బాధ్యతల భారం పెరుగుతోంది. దీంతో సుమారు 16 నెలలుగా విధులకు గైర్హాజరవుతున్న సీఆర్పీని తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఉషాబాల గైర్హాజరు విషయంపై ఎంఈవో-2 పట్నాన రాజారావుతో మాట్లాడగా గైర్హాజరు వాస్తవమేనని చెప్పారు. సమాచారాన్ని పలుమార్లు ఎస్ఎస్ఏ అధికారులకు తెలియజేశామన్నారు.

చికిత్స పొందుతూ మృతి



మృతుడు రాజారావు (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటలో వ్యవసాయ కూలీ బమ్మిడి రాజారావు(50) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాలతో మూడు రోజుల క్రితం పొలాలకు వినియోగించే కలుపు మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. భార్య బమ్మిడి సరస్వతి ఇచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.

అనుమానాస్పదంగా విశ్రాంత మహిళా ఉద్యోగి మృతి



సూర్యకాంతం(ఫైల్)

నరసన్నపేట: స్థానిక శ్రీనివాసనగర్-5లో అద్దె ఇంట్లో నివాసముంటున్న ఆర్.సూర్యకాంతం(62) అనుమానాస్పదంగా మృతి చెందారు. గత మూడు రోజులుగా ఇంటి డోర్ తెరవకపోవడంతో ఇరుగుపొరుగు వాళ్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆమె పెంపుడు కుమార్తె జ్యోత్స్న ఆదివారం రాత్రి వచ్చి పరిశీలించగా సూర్యకాంతం మంచంపై మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ ఇంటిని సోమవారం పరిశీలించి కేసు నమోదు చేసి, పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా సూర్యకాంతం మండలంలోని మాకివలస పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా పనిచేస్తూ జూన్ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందారు. ఆమె ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. కుమార్తె జ్యోత్స్నకు వివాహమవ్వగా రాయగడలో ఉంటున్నారు. ఈ దశలో ఆమె మృతి చెందారు. ఆమె పెంపుడు కుమార్తె జ్యోత్స్న మాట్లాడుతూ రెండు రోజుల క్రితం తనతో అమ్మ మాట్లాడి ఒంట్లో బాగులేదని చెప్పారన్నారు. అయితే ఆ తర్వాత ఆమె నుంచి ఫోన్ రాకపోవడం, తాము చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి ఓనర్‌కు పరిశీలించమన్నామన్నారు. ఇంటి తలుపులు లోపల నుంచి వేసి ఉన్నాయని చెప్పారన్నారు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుందని చెప్పడంతో ఆదివారం రాత్రి వచ్చి పరిశీలించగా మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.